కులవృత్తుల్ని నిరాదరించి చదువుల కెగబడి మధ్యతరగతి మిథ్యా విలువల్లోక రాజకీయ ప్రయోజనాలకై యువకుల్ని నెట్టివేయడం ఈనాటి వాస్తవం. ఈ పరిణామంలో బలహీన వర్గాలనుంచి డీ క్లాస్ అవుతున్న యువకులకు 'కసి' తప్ప భవిష్యత్‌పై ఆశా సూర్యోదయ కిరణాలు వెలగడంలేదు-ఎటువైపు పోతున్నాం మనం?

"మా శివాజికి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషనొచ్చింది సార్." డి. యస్పీ. రామకృష్ణకు క్రాపు కత్తిరిస్తూ అన్నాడు చెంగల్రాజు.

చెంగల్రాజు క్రాపు కత్తిరిస్తుంటే ఒక న్యూస్ బ్యూరో కదిలిపోయినట్టే.

"ఆహాఁ! ఎక్కడి కేశారు శివాజీని" రామకృష్ణ అడిగాడు ఒళ్ళు విరుచుకొంటూ. చెంగల్రాజు కత్తెరక్రింది జుట్టు ఎగుడు దిగుడైంది.

"అదిలాబాద్ కేశారు సార్! నిన్ననే వచ్చి పోయాడు."

"మంచివాడోయ్ శివాజీ...పైకివస్తాడు. అతనేమౌతాడు నీకు" అడిగాడు డి.యస్పీ.

"మా అన్న కొడుకు సార్! కష్టపడి నదువుకొన్నాడు. సెలెక్షన్‌లో ఫస్ట్ వచ్చినాడు .... పై ఆఫీసర్లకు మంచిగా మెలిగాడు. డ్యూటీ కరెక్టు, మాట కరెక్టు.... తొరగా ప్రమోసన్ ఇచ్చారు" క్రాపు సరిజేస్తూ అన్నాడు చెంగల్రాజు.

"నీ కొడుకు లేమిజేస్తున్నారు" అడిగాడు రామకృష్ణ.

"పెద్దోడు బి.య్యే. ఆఖరు సంవత్సరం పదువుతున్నాడయ్యా. ఇదుగో వీడు సిన్నోడు." కత్తి సానబట్టి తన చేతికిస్తున్న కుర్రాణ్ని చూపిస్తూ అన్నాడు చెంగల్రాజు.

"వీణ్ని చదివించలేదా?" రామకృష్ణ ప్రశ్నించాడు.

"లేదు సార్! ఇద్దరూసదువుకొంటే నాకెవరు సాయంజేస్తారు! సాపుమీద బోలెడు అప్పుంది బ్యాంకి వాళ్ళిచ్చారు వీడిపేరు మీదనే యిచ్చారు. నాకూ వయసయి పోతూంది. ఇప్పుడు వీడే యింటికి ఆదరవైనాడు."

చెంగల్రాజు క్రాపు పూర్తి చేశాడు.

"పెద్దవాడు బాగా చదువుతాడా" క్రాపు దువ్వుతూ అన్నాడు డి. యస్పీ.

"ఎమి సదువులో సార్....సదువుల్లో ఎట్లా వున్నాడో మాకేమి తెలుస్తుంది. స్ట్రయిక్‌లు జేస్తున్నప్పుడు మైకులో వీడే అరుస్తుంటాడు .... ఎమ్మెల్లే గారింటికి అప్పుడప్పుడూ పిలుచుకొంటుంటారయ్యా!"

"ఎందుకూ క్రాపు జెయ్యడానికా?" గుడ్డలు దులుపుకొంటూ అడిగాడు డి. యస్పీ.

"అబ్బే! వాడు కులవృత్తిని అసయ్యించుకొంటాడయ్యా! ఎమ్మెల్లేగారు స్ట్రైక్ విషయాలు మాట్లాడుతుంటారయ్యా!.... వీళ్ళకూ స్టూడెంట్సు యూనియన్ వుందిగదయ్యా....దానికి వీడు సెక్రెట్రీ."


"ఈ సమ్మెలూ సంఘాలూ కూడుపెట్టవని చెప్పు నీ కొడుక్కి.... చదువుకొని పైకి వస్తే సరేసరి. శివాజీలా మంచి పొజిషన్ కొస్తాడు. లేకపోతే సెలూన్‌లో పెట్టెయ్ .... సెంటర్‌లో మోడరన్‌గా సెలూన్ పెడితే మంచి డిమాండుంది" పర్సులోంచి డబ్బుతీసి యిస్తూ అన్నాడు డి. యస్పీ.

"వాడి కొద్దు సార్ సెలూను! నా ఆశలన్నీ వాడిమీదే వున్నాయి. వాడు ఇన్స్పెక్టరవ్వాలని నా కోరిక" చెంగల్రాజు ముఖం ఆనందంతో ఉబ్బిపోయింది.

"ఆల్‌రైట్.... నీ విశ్వాసం నీది.... కానియ్" ఇంట్లోకి వెళ్ళిపోతూ అన్నాడు రామకృష్ణ.

నమస్కారంపెట్టి సరంజామా సర్దుకొని చిన్నకొడుకుని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు చెంగల్రాజు.

* * *




అరుపులతో వూరేగింపుసాగిపోతూంది. కుదుపులతో మైకుబండివూగిపోతూంది.

"ప్రతి విద్యార్థీ సమ్మెలో చేరాలి."

"పరీక్షల విధానం మారాలి."

"పరీక్షలు వాయిదా వేయాలి."

"ప్రిన్సిపాల్ను మార్చివేయాలి."

"ప్యాస్‌మార్కుల హద్దును దించాలి."

"ప్రశ్నాపత్రాలను కుదించాలి."

'పదిశాతం గ్రేస్‌మార్కులు కలపాలి.'

"ప్రతి విద్యార్థికీ రిజల్టు తెలపాలి."

నినాదాలు తారస్థాయికి చేరుకొన్నాయి. నిమ్మగడ్డవారివీధి మలుపుతిరిగి మెయిన్ రోడ్డు కెక్కింది విద్యార్థుల ఊరేగింపు. రత్తాలు షాపు బయటకొచ్చి నిల్చొని మెరవణి చూస్తున్నాడు. వాడి చేతుల్లో కత్తెర, దువ్వెన వున్నాయి.

రత్తాలు చెంగల్రాజు చిన్నకొడుకు.

మొత్తం సెలూన్ కొచ్చిన వారంతా




# (వ్యా)కులవృత్తి

మల్లెమాల వేణుగోపాలరెడ్డి

ఊరేగింపు చూస్తున్నారు.

శేఖరం ఊరేగింపుకు నాయకత్వంవహిస్తున్నాడు.

సెలూన్ దగ్గర కొస్తూనే శేఖరం ఊరేగింపులోంచి తప్పుకొని ఈల వేసుకొంటూ సెలూన్‌లోకి దూరాడు.

రత్తాలు షాపులోకి వచ్చాడు.

శేఖరం చేతికి దువ్వెన ఇచ్చాడు రత్తాలు.

ఈల వేసుకొంటూనే అద్దంలో చూసి తల దువ్వుకొన్నాడు శేఖరం. దువ్వెన రత్తాలు కిచ్చాడు. గుడ్డలు దులుపుకొని కాలర్ సరిచేసుకొని సెంటురాసుకొన్నాడు.

రత్తాలు డ్రాయరు తీసి రూపాయి నోటిచ్చాడు శేఖరానికి.

"అయ్య లేడా ?" అడిగాడు శేఖరం.

"అయ్య ఆదిలాబాదు వెళ్ళాడు చిన్న" చెప్పాడు రత్తాలు.

"అంగలేసుకొంటూ ఊరేగింపులో కలిసిపోయాడు శేఖరం.

కృంగిపోయిన హృదయంతో రోడ్డు వైపు, శేఖరంవైపు చూస్తూనే ఉన్నాడు రత్తాలు.

రత్తాలు అసలు పేరు రత్నం. షాపు కోసం మార్చుకొన్న పేరు రత్తాలు. వెంగళ్రాజు పెద్ద కొడుకు శేఖరం. ఇంటివద్ద పిలిచే పేరు పెద్దోడు .... కాలేజీలో పేరు శేఖరం.

* * *

"మా అన్నను వదిలిపెట్టండి సార్"

## మరీ చిత్రం

ఒక మోడరన్ ఆర్టిస్టు యింట్లో పెద్ద దొంగతనం జరిగింది. "మీరు దొంగని చూశారుకదా. పైగా చిత్రకారులుకూడాను. ఒక స్కెచ్ గీసిస్తే దాని ఆధారంగా దొంగని యెక్కడున్నా వెదకి పట్టుకుంటాం" అని పోలీసులు హామీయిచ్చారు.

ఆర్టిస్టు స్కెచ్‌గీసి యిచ్చాడు. దాని ఆధారంగా పోలీసులు పట్టుకున్నవి రెండు జతల బూట్లు, ఒక అగ్గిపెట్టె, చిన్న కొండ రాయి వగైరా.

★

## ఉమ్మడి ఖాతా

భర్త డిపాజిట్ చేసే హక్కును, భార్య డ్రా చేసే హక్కును కలిగి వుండు ఖాతా.

★

## తప్పెవరిది?

"ఒక పెద్ద కథని కుదించి చిన్న కథగా రాయడానికి అయిదేళ్ళు పట్టింది. అప్పుడు తెలిసింది కథకునికి వుండవలసినంత ప్రతిభ నాలో లేదని" అని వ్యాఖ్యానించాడొక స్టోరీ రచయిత.

"ఆ తర్వాత మరి మీరు కథలు రాయడం మానేశారా" అని ఆత్రుతగా అడిగాడు శ్రోత.

"లేదు. అప్పటికే నాకు గొప్ప పేరు వచ్చేసింది. ఇక ఏమీ చెయ్యలేక రాస్తూ వుండిపోయాను."

★

## సహజసిద్ధం

"మీరు సహజంగానే భారతదేశ పౌరునిగా జన్మించారా?" లేదు. ఆపరేషన్ ద్వారా.

---

శ్రీరామ నామం? మరువాం మరువాం!
గోలెంలో పాతేర? దవనాం దవనాం!

—నిష్టల వెంకట్రావ్

---

చేతులు కట్టుకొని అడిగాడు రత్తాలు.

"ఎవరు నువ్వు" విసుగ్గా అన్నాడు డి. యస్పీ. రామకృష్ణ.

"నాపేరు రత్తాలు సార్! తమకు క్రాపు జేసే సెంగల్రాజు సిన్నకొడుకుని."

"మీ అన్న ఎవరు" అడిగాడు రామకృష్ణ.

"శేఖరం సార్! కాలేజీలో సదువుతున్నాడు.... నిన్న సమ్మె జేశారని అరెస్టు జేశారు.... మా అయ్య ఆదిలాబాదుకు మా శివన్న దగ్గరి కెళ్ళాడు.... నాకు భయంగా వుంది. మా అన్నను వదిలిపెట్టండి సార్!" దీనంగా అడిగాడు రత్తాలు.

"ఓహో! శేఖరం చెంగల్రాజు కొడుకా.... వాడు పెద్ద హీరోగదటోయ్! నిన్న ఆర్. టి. సీ. బస్సును తగలబెట్టాలని ప్రయత్నం చేశారు వీళ్ళంతా. మీ అన్న దానికి నాయకుడు. సమయానికి వెళ్ళి ప్రమాదాన్ని తప్పించాము మేము. ఊఁహుఁ.... వాడ్ని వొదిలి పెట్టడం వీలు కాదు."

అధికార హోదాలో మాట్లాడాడు డి. యస్పీ.

"ఈ సారికి వొదిలెయ్యండి సార్! మాయమ్మ యింటిదగ్గర మంచినీళ్ళుకూడా ముట్టలేదు. నేను సాపుమూసి వచ్చేసినాను. వాడికి మేమేదో చెప్పుకొంటాం.... మా అయ్య వస్తూనే నాలుగు సీవాట్లు పెటిస్తాం. ఈ సారికి వదిలెయ్యండి సార్!" కంట నీరు పెట్టుకొని డి.యస్పీ. కాళ్ళు పట్టుకోబోయాడు రత్నం.

రామకృష్ణ గుండె కరిగింది. "సరే నువ్వెళ్ళు. మీ అయ్యతో చెప్పు వాడ్ని గట్టిగా దండించమని."

రత్తాలు వెళ్ళిపోయాడు. కంట్రోల్ రూమ్ కెళ్ళి శేఖరాన్ని చూసివచ్చి షాపు ఓపెన్ చేశాడు.

కేసు నమోదు చేసుకొని విద్యార్థులనంతా వొదిలిపెట్టాడు డి. యస్పీ.

శేఖరానికి చీమ కుట్టినట్టయినా లేదీ అరెస్టు.

శేఖరం విడుదలైన వార్త విని ఎంగిలి పడింది చెంగల్రాజు భార్య.

శేఖరం షాపుకొచ్చి తల దువ్వుకొని డ్రాయరు తెరిచి రూపాయి తీసుకొని సమ్మె పూర్వాపరాలు చర్చించడానికి కాలేజీ కెళ్ళాడు.

* * *

"శివుడు దగ్గరి కెళ్ళరా! వాడు నిన్ను పంపించమని రాశాడు. ఆదిలాబాదులో ప్రయివేటు చెప్పిస్తాడట.... సెప్టెంబరుకు కట్టుకోమని రాశాడు."

చెంగల్రాజు శేఖరానికి చెప్పాడు.

"సెప్టెంబరు కెట్లా వీలవుతుందయ్యా! ఆగస్టు చివర్లో ఎలెక్షన్లు. ఎమ్మెల్లేగారికి మాటిచ్చాను క్యాన్‌వాస్‌కు వస్తానని.... మార్చికి కట్టుకొంటాలే" బయటికి వెళ్ళబోతూ అన్నాడు శేఖరం.

"ఇంకా ఎందుకురా నీకు ఎలెక్షన్ గొడవలు.... గాలికి తిరిగి అడ్డమైన కూడు తిని పరీక్షలు తప్పావు.... ఎలెక్షన్లు కూడు పెట్టవు తెలుసుకో" కోపంగా అన్నాడు చెంగల్రాజు.

"పరీక్షలూ, చదువులూ అంతకంటే అసలు కూడు బెట్టవు" దురుసుగా అనేసి వెళ్ళిపోయాడు శేఖరం.

"వాడిమానాన వాణ్ణి పోనీయండి. కాలం కొద్దీ మనమూ నడుసుకోవాలి. కసిరి లాభం లేదు.... కలెక్టరాఫీసు దఫేదారు గంగోజీ కొడుకును దబాయించేసరికి వాడు ఇల్లు వొదిలి పారిపోయాడు." చెంగల్రాజు భార్య అంది.

"ఉద్ధరించాడు! వీణ్ణి పారిపొమ్మను.... సదువు లేకపోయినా సిన్నోడే నయం. నాలుగురాళ్ళు సంపాదిస్తున్నాడు" ఆవేశంతో అన్నాడు చెంగల్రాజు.

"పెద్దోడూ పైకొస్తాడు. నౌకిరీ సేస్తాడు మీరు సూస్తుండండి. పెద్ద పెద్దోళ్ళంతా వాడికి వరిసెయముండారు. వాళ్ళే సూసుకొంటారు వీన్ని."

నచ్చజెప్పి జూసింది ఆమె.

"ఎర్రిదానా! వాళ్ళంతా వాళ్ళ అవసరాలకు వీణ్ణి వాడుకొంటారే. ఆనకయెవురూ పలకరించరు. శివుడు యెంతమందితో పరిచయం పెట్టుకొని పైకి వచ్చాడంటావు. వాడు మా అన్న బతుకులో బంగారుపంట ఏమి మర్యాద.... ఏమి వినయం.... వాడు ఎంత ఆప్యాయంగా చూశాడు నన్ను — ఆదిలాబాదులో.... వాడు పైకి రావడానికి నేనే కారణమన్నాడు. వాడి సదువుకు నేను మదుపు పెట్టబట్టే సదువుకోగలిగాడంట. దేనికైనా దేముడు రాసి పెట్టాలి" నిట్టూర్చి షాపు కెళ్ళాడు చెంగల్రాజు.

* * *

"ఇక చాల్లేరా నీ వుద్యోగ ప్రయత్నాలు .... ఆరు నెల్లనుంచీ అఘోరిస్తున్నావు.... సాపు కొచ్చెయ్ రేపట్నుంచి" అన్నాడు చెంగల్రాజు శేఖరంతో.

"ఆరు నెలల్లో ఉద్యోగాలెక్కడ దొరుకుతాయి? ఆరేళ్ళకైనా దొరికితే గొప్పే" గోళ్ళు కొరుకుతూ అన్నాడు శేఖరం.

"ఆరేళ్ళ వరకూ ఇలాగే వీధులుపట్టి తిరుగుతావా" చుట్ట పారేస్తూ అన్నాడు చెంగల్రాజు,

"ఎందుకయ్యా అట్టా కసురుకొంటావు నీ వలుకుబడి ఉపయోగించి ఛేర్ మెన్

సుబ్బారెడ్డికి చెప్పి మునిసిపల్ ఆఫీసులో క్లర్కు పని ఖాళీ వుందంట. ఇప్పించ గూడదా! నీకేమీ పట్టనట్టు కూచొంటా వాయే!" సగం గొంతులోనే అన్నాడు శేఖరం.

"అవున్రా నాకు పెద్దపలుకుబడి వుంది ఛేర్మెన్ దగ్గర. ఎందుకంటే నేను కవున్సి లర్నిగదూ. ఆ అయ్యకూ మీ అయ్య క్రాపు జెయ్యడం తప్పితే యింకేమీ సొరవలేదు ఆయనతో. అప్పటికీ దేబిరిం చాను. నువ్వేమీ బి. ఏ ఫస్టుక్లాసా. అతుకు లతుకుగా డిగ్రీ మూడోక్లాసులో ప్యాస య్యావు. అదేమాట ఆయన చెప్పి చెబుతున్నాడు" కటువుగా అన్నాడు చెంగ ల్రాజు.

"ఎమ్మెల్లేగారు ఆదివారం రమ్మన్నారు ఎస్సై సెలెక్షనుకు హైదరాబాదుకు లెట రిస్తా నన్నారు. పోతే పని జరుగుతుంది." శేఖరం అన్నాడు.

"జరుగుతుంది.... తప్పకజరుగుతుంది. ఎందుకంటే నువ్వాయన మేనల్లుడివి. అందుకని .... ఆఁ ....మళ్ళీ రెండొందలు క్షవరం అక్షతాయన్నమాట.... అంతేనా" విసుక్కొంటూ అన్నాడు చెంగల్రాజు.

"అన్నిటికీ అలా అంటే ఎట్లా ?? అందరూ శివుడిలా గుండాలంటే ఎట్లా ? మనబిడ్డ బరువుమనంమొయ్యకపోతే...." అంది చెంగల్రాజు భార్య.

"కాలం కలిసి రానప్పుడు కాలంతో పాటు మనమూ నడుచుకొని కలోగంజో తాగాలి .... శుభ్రంగా వీణ్ణి రేపట్నుంచీ సాపుకు రమ్మను పని నేర్చుకొంటాడు."

"చివరకు మళ్ళీ క్రాపు కత్తిరించ మంటున్నాడమ్మా అయ్య !! ఇన్నాళ్ళూ కలెక్టర్ని జేస్తానన్నాడు" శేఖరం మొహం తిప్పుకొని అన్నాడు.

"అవునురా కలెక్టరువి కాదుగదా.... కండెక్టరువి కూడా కాలేకపోయావు. ఏం ?! కులవృత్తి తప్పు పనా, ఆ మాటకొస్తే రెడ్లూ, బ్రాహ్మణులు కూడా సెలూన్లూ, లాండ్రీలు పెట్టి వున్నారు సిటీల్లో" సమ ర్థించుకుంటూ అన్నాడు చెంగల్రాజు.

"వాడెప్పుడు క్రాపులు జేశాడు ఇప్పుడు సాపుకు రావడానికి?" అంది శేఖరం తల్లి.

"వస్తే నేర్చుకొంటాడు. ఇప్పుడు రమ్మను. సిన్నోడు రెండ్రోజుల్నించీ సాపుకు రాకపోతే నాకు సెయ్యి విరిగి నట్టుంది." అన్నాడు చెంగల్రాజు.

రత్తాలు జ్వరంతో మంచమెక్కాడు.

"అవు నన్నా! నువ్వు రేప సాపుకెల్లు. అయ్య ఒక్కడే పని చెయ్యడం కష్టం." జ్వరంతో మూలుగుతూనే అన్నాడు రత్తాలు.

ప్రఖ్యాత రష్యను రచయిత లియో టాల్‌స్టాయ్‌కి కొంత కాలంపాటు నాటకా లంటే మంచి ఆసక్తి ఉండేది. ఒకనాటి సాయంకాలం టాల్‌స్టాయ్ మాస్కో లోని మాలీ థియేటరుకు నాటక ప్రదర్శన తిలకించటానికి వెళ్లాడు. ఆ రోజు



లాబిక్ వ్రాసిన "ఏన్ ఇటాలియన్ స్ట్రాహాట్" అనే కామెడీ ప్రదర్శింపబడు తున్నది. ఆ సమయంలో ఆయన "ది ఫ్రూట్స్ ఆఫ్ ఎన్ లైటెన్‌మెంటు" అనే కామెడీ రచిస్తు న్నారు. విశ్రాంతి సమయంలో పరిచయస్థుడైన ఒక ప్రొఫె సరు కనపడ్డాడు. ఇటువంటి చౌకబారు నాటికకు తను రావటం టాల్‌స్టాయ్ కంటపడ్డందుకు కించపడుతూ "నువ్వు కూడా ఈ పిచ్చి నాటకం చూడడానికి వచ్చావా?" అని ప్రశ్నించాడు. "ఇటువంటిదేదో రచన చెయ్యాలని నా జీవితమంతా కలలు కన్నాను. కాని నాకు తగిన ప్రతిభ లేకపోయింది." అని జవాబిచ్చాడు టాల్‌స్టాయ్.

— ఆర్. శ్యామల

శేఖరం తమ్ముడికేసి చూశాడు.... దైన్యం అతడి హృదయాన్ని ఆకళిం చింది.

"నేను రేపు సాపుకొస్తానయ్యా! నువ్వేం దిగులు పడకు" కాళ్ళకు చెప్పులు దూర్చుకొని బయటి కెళ్ళాడు శేఖరం.

* * * *

"మొదటి రెండ్రోజులు చిన్నపిల్లల క్రాపులు, ముసిలివాళ్ళ గడ్డాలు పట్టిస్తాను, చెయ్యి" అన్నాడు చెంగల్రాజు షాపులో శేఖరంతో. గాట్లుపెట్టో, గంట్లుపెట్టో తలలూ, గడ్డాలు క్షవరం చేశాడు శేఖరం. రెండురోజులు.

మూడోరోజు క్రాపు చెయ్యడానికి కత్తెరా, దువ్వెనా పట్టాడు.

'ఓయ్.... శేఖర్.... యూఆర్ హియర్' అన్నదా కుర్చీలో కూర్చొన్న యువకుని కంఠం.

శేఖరం షాక్ తిన్నాడు. ఆ కంఠం తన స్నేహితునిది. అతను తను చదువు కునేటప్పుడు కాలేజీ విద్యార్థి యూనియన్ ఛేర్మెన్.

శేఖరం అవమానంతో కృంగి పోయాడు.

క్రాపు చేస్తున్నాడు శేఖరం.

కత్తెర సరిగా ఆడటం లేదు.

రెండు మూడుసార్లు ఎగిరి పడ్డాడు స్నేహితుడు.

"ఏమిట్రా కాలేజీ స్త్రియికుల్లా క్రాపులు చేస్తే ఎలా.... దీని కొంత ఓపికుండాలి ఒళ్ళు దగ్గర పెట్టుకొని చెయ్యి భాయ్." వ్యంగ్యంగా అన్నాడా యువకుడు.

"అయ్యా! ఈ బాబుకు క్రాపు నువ్వు చెయ్యయ్యా" కత్తెరా, దువ్వెనా చెంగ ల్రాజు గల్లామీద పెట్టేసి స్పీడుగా వెళ్ళి పోయాడు శేఖరం షాపు వదిలిపెట్టి.

* * *

"మళ్ళీ మొదటికొచ్చాడు వీడు. క్రాపు సగంలో వదిలిపెట్టి షాపు వదిలి వచ్చే శాడు" భార్యతో అన్నాడు చెంగల్రాజు.

"నేను క్రాపులు చెయ్యలేనయ్యా! నేను అవమానం భరించలేనయ్యా.... యింత బతుకూ బతికి మళ్ళీ క్రాపులు చెయ్యలేనయ్యా." గాద్గదికంగా అన్నాడు శేఖరం.

"ఎంత బతుకు బతికావురా.... నువ్వే మన్నా జమిందారు బిడ్డవా .... గవర్నోరి అల్లుడివా.... కేవలం చెంగల్రాజు కొడు కువి. గుర్తుంచుకో" గట్టిగా అన్నాడు చెంగల్రాజు.

"నన్నెందుకు చదివించావయ్యా! చదువుకోకపోతే చిన్నోడిలా నేనూ షాపు కొచ్చేవాడ్నికదా" వినయంగానే అన్నాడు శేఖరం.

"చదివించినందుకు సాధించిందేందిరా? జులాయిలా తిరిగావు, జులపాలు పెంచావు. నీ జుట్టు కత్తిరించాలన్నా చివరకు నేనో, సిన్నోడో నీకు గతి.... సదివినోళ్ళు జుట్లు కత్తిరించగూడదా.... సిటీలకు బోయిసూడు హోటళ్ళలో భోజనాలు సప్లై జేస్తున్నారు" గదమాయిస్తూ అన్నాడు చెంగల్రాజు.

"పోనీలే అయ్యా నాకు జొరం తగ్గి పోయిందిగా.... నేను సాపుకొస్తాను రేప ట్నుంచీ" రత్తాలు లేచి వచ్చి కూర్చొని అన్నాడు.

# జ్ఞాపకాల హవేలీ

జ్ఞాపకాల హవేలీలో
సంచారం చేసే ఒంటరి మనస్సు
వెన్నెల రెక్కలు తొడుక్కొని,
దూరాకాశ వీథుల్లోకి
విహారానికి పోతుంది—

అప్పుడే హవేలీ
శూన్యంగా, బెంగగా, మిగిలిపోదు:
కిటికీ మీదకి వంగి
సుతిమెత్తని రేకుల వ్రేళ్ళతో తట్టి,
ఓరవాకిలిగా వేసి,
ఒక పూలకొమ్మ కాస్తంత పరిమళం జల్లి
పక్కకిపోతుంది—

ఎక్కడ నుంచో ఒక అగరు మబ్బు
పల్చపల్చగా జరిగివచ్చి
పడకటింటిలో మంచానికి
పందిరి వేస్తుంది.

గుమ్మానికీ, గుమ్మానికీ మధ్య
సుతారంగా కదిలే పల్చటి తెరలమీద
అత్తరు గుబాళింపులాంటి సన్నివేశాల్ని
ముద్రించి—
ఒక వయస్సు వెళ్ళిపోతుంది—
ఇదంతా—
ప్రతి రోజూ జరిగిపోతూనే వుంటుంది,

సావధానంగా విశ్రమించిన
ఏ క్షణంలోనో,
మనస్సు సన్నిధిలో ఒక్కొక్క పరిమళం
చేతులుకట్టుకు నిలిచి,
తనని పరిచయం చేసుకుంటుంది
మళ్ళీ మళ్ళీ—
వెన్నెల రెక్కలున్న దొర
ఎప్పుడో కాని దొరకడం కుదరదని—

అయినా—
జ్ఞాపకాల హవేలీలో
అప్పుడప్పుడూ
పరిమళాల దర్బారు జరుగుతూంటుంది—
ఆ విరగబడే నవ్వులూ,
సంతోషపు కన్నీళ్ళూ,
వయస్సు విదూషకుడి పరాచికాలూ....

హద్దుల మధ్య జీవితం
జబ్బులా, వార్ధక్యంలా,
బెంగ పుట్టిస్తుంది కాబోలు!—
అందుకే—
మనస్సు, ఇంకా ఇంకా వెన్నెల రెక్కలు
తొడుక్కొని
ఆకుపచ్చని యౌవన వనాలవైపు
పరుగులు తీస్తుంది—

హవేలీలో, కోలాహలం మాత్రం
అర్ధరాత్రయినా,
ఇంకా వినిపిస్తూనే వుంటుంది....

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

"పెద్దోడో....వాడి సంగతేమిటి....ఒరే పెద్దోడా.... ఈడ కాకపోతే ఇంకొక సిటీ కెళ్ళు....ఏదో ఒక ఉద్యోగం చేసి నాలుగు రాళ్ళు సంపాదించు....ఏదీ దొరకకపోతే అక్కడే ఒక సెలూన్ పెట్టుకో.... అక్కడికి నీ స్నేహితులూ రారు నీకు అవమానమూ వుండదు.... ఎల్లాగో అల్లా నీ పొట్ట పోషించుకునే మార్గం చూడు. నిన్ను చదివించి చెడిపేశాననే నింద నాకు తీసుకురాకు. వెళ్ళు ప్రయోజకుడివయ్యాకనే నాకు మొఖం చూపించు" నిటూరుస్తూ అని చెంగల్రాజు తుండుగుడ్డ పైన వేసుకొని బయటి కెళ్ళాడు.

* * *

"ఇప్పుడికన్నా రాయండి .... పెద్దోడు ఎక్కడుండాడో గాలించమని .... మూడు నెలలయింది వాడు ఇల్లు వొదిలిపెట్టిపోయి. వాడి కబురే తెలియలేదు" చెంగల్రాజుతో అంది భార్య.

"వాడుమాత్రం ఎక్కడని వెతుకుతాడు? చదువుకొనేటప్పుడే వాడ్ని సరైన దార్లో పెట్టి వుండవల్సింది. ఇప్పుడనుకొని ఏం లాభం. వాడు రెంటికీ చెడ్డాడు." దిగులుగా అన్నాడు చెంగల్రాజు.

చెంగల్రాజు, శేఖరం దిగులుతో మంచమెక్కాడు. శివాజీ వచ్చాడు చిన్నాన్నని చూసిపోవడానికి.

"శేఖరం ఆచూకీ తెలియలేదు చిన్నయ్యా. నువ్వు తొందరపడ్డావు. వాడ్ని మందలించడం నీ తప్పు. ఈ దేశానికి నిరుద్యోగ సమస్య తీరనిది. వాణ్ణి అని ఏం లాభం" శివాజీ అన్నాడు.

"వాణ్ణి నేనేమన లేదు శివుడూ.... సెలూన్ పెట్టుకోమన్నాను. అంతే.... అది తప్పా....చదువుకొన్నోడు సెలూన్ పెట్టుకోగూడదా. గుమాస్తాలకు ముష్టిమూడొందలు రాదు నెలకు. చిన్నాడు సెలూన్ మీద రోజుకు ఇరవై సంపాదిస్తున్నాడు బ్యాంకు అప్పు కూడా తీర్చేశాడు."

చెంగల్రాజుకు దగ్గు తెర వచ్చింది. తమాయించుకొన్నాడు. ఒళ్ళంతా స్వేదం పోసింది.

"అది వాడి తప్పు గాదయ్యా! ఈ సంఘం ఆయా వృత్తులవారి మీద చూపుతున్న చిన్నచూపు. మౌలికంగా ఈ వ్యవస్థ మారిన రోజు ప్రతి చదువుకొన్నవాడూ ఏదో ఒక వృత్తి చేబడతాడు" అంతదాకా మనం బాధపడక తప్పదు" ఆవేశంగా అన్నాడు శివాజీ.

గసబోసు కొంటున్నాడు చెంగల్రాజు పెద్దగా దగ్గాడు. ఆయాసం యెక్కువయింది. చిన్నోణ్ణి షాపుదగ్గర్నుంచి పిలిపించారు.

"శివుడూ నేనింక బ్రతకను....రత్తాలూ నీ అమ్మకు నువ్వే యింక ఆదరవు. శివుడూ నువ్వు సదువుకొన్నోడివి. ఆ సదువుకొన్నోడికి నువ్వే యేదన్నా దారి సూపించు. ఇద్దరికీ యిద్దర్నీ అప్ప జెపుతున్నాను. వాడు నా ఆఖరు క్షణంలో దగ్గరలేడు."

దీర్ఘంగా మూలిగి అచేతనుడైనాడు చెంగల్రాజు. అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

శివాజీ, డి. యస్పీ. రామకృష్ణ ఇద్దరూ దగ్గరుండి జరిపించారు దహనక్రియలు. మూడో రోజు తలవనితలంపుగా వచ్చాడు శేఖరం. పట్టింట్లో దీపం చూసి నివ్వెరపోయాడు అయ్య రూపం మదిలో మెదిలి కొయ్యబారాడు.

"అమ్మా! హైదరాబాదు ఆబిడ్స్‌లో సెలూన్ పెట్టాను. ఓపెనింగుకు అయ్యనూ నిన్నూ చిన్నోణ్ణి తీసుకుపోదామని వచ్చాను...." గొంతు బొంగురుపోయింది శేఖరానికి. చిన్నోణ్ణి పట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు పెద్దోడు.

